



భోజనం చేసి తాపీగా కూర్చుని రెండు కాళ్ళూ టేబిల్ మీద పడేసి చుట్ట కాల్చుకుంటూ కిటికీలోంచి చూడటం రోజూ లంచ్ టైమ్‌లో నా కార్యక్రమం. ఆ ఆఫీసుకి నేనే ఆఫీసర్ని. అలా ఎంతసేపు కూర్చున్నా నన్నడిగే వాడెవడూ లేడు. అలా చూడటం నేను ఎంత వద్దనుకున్నా జరుగుతూ వుంటుంది. దానికి కారణం నా ఆఫీసు కిటికీకి ఎదురుగుండా వున్న మోటారు కార్ఖానాలో కుర్రాడు. నా ఆఫీసులాగే ఆ కార్ఖానాకి కూడా ఒకడే యజమాని. తేడా ఏమిటంటే-లంచ్ అవర్లో నా ఆఫీసులో వాళ్ళంతా బయటికెళితే, నేనొక్కడ్నీ భోం చేసి పళ్ళసందుల్లో ఇరుక్కున్న మెతుకుల్ని పుల్లతో బైటికి తీసి రుచిగా వుంటే చప్పరించడమో, లేకపోతే ఉమ్మెయ్యడమో చేస్తూ వుంటాను. ఆ కార్ఖానాలో-యజమాని మిగతా ఇద్దరు అసిస్టెంటు కుర్రాళ్ళు బయటికి వెళ్ళిపోతే, ఆ కుర్రాడొక్కడూ టెంపరరీగా కార్ఖానాని పాలిస్తూ వుంటాడు. కార్ఖానా తలుపులు బార్లా తీసేసి వుంటాయి. ఒకటి రెండు కార్లు, అరడజను మోటారు సైకిళ్ళు ఎప్పుడూ వుంటాయి అందరూ బయటికెల్లిపోయాక ఆ కుర్రాడు ఎక్కడో దాచిన అద్దం పైకి తీస్తాడు. చేతులు కడుక్కునే సబ్బుతోనే ముఖం కడుక్కుని, జేబులో జాగ్రత్తగా మడత బెట్టిన గుడ్డ ముక్క తీసి తుడుచుకుంటాడు. విరిగిపోయిన దువ్వెన జేబులోంచి తీసి దాన్ని శుభ్రంగా తుడిచి,

**ఆ కుర్రాడలా తిరుగుతూ వుంటే, ఎందుకో బోనులో తిరుగుతున్న పెద్దపులి గుర్తొచ్చి నా ఎముకల్లో చలి బయల్దేరుతుంది.**

తల నున్నగా దువ్వుకుని, ఆ అద్దంలో చూసుకుని, బట్టలు దులుపుకుని, ఆ అద్దం జాగ్రత్తగా దాచేసి, దువ్వెన, గుడ్డముక్క మళ్ళీ జేబులో పెట్టుకుని ఆ కార్ఖానా ముందు కొచ్చి నిలబడి ఇటూ అటూ చూస్తాడు. అలా ఆ కుర్రాడు చూస్తూ వుంటే నాకు ఏమిటో ఉడుకుమోత్తనంగా వుంటుంది. తలుచుకుంటే

ఆ కుర్రాడ్ని, ఆ కార్ఖానాని, ఆ యజమానినీ అందర్నీ కొనగల తాహతున్న వాణ్ణి నేను. అయినా ఆ కుర్రాడు పొందుతున్నంత ఆనందం కొన్ని ఏళ్ళుగా నాకు కలిగినట్టు గుర్తు లేదు నా ముఖం ఎప్పుడూ చిటపటలాడుతూనే వుంటుంది. ఆ కుర్రాడు మటుకు ప్రపంచం నడినెత్తి మీద కాలు పెట్టి నిలబడినట్టుగా వుంటాడు.

నా ఆఫీసుకి ఆ కార్ఖానాకి దగ్గరగా ఒక స్కూలుంది. ఆ కుర్రాడు నీటుగా కథల్లో రాజకుమారుడిలా తయారై కార్ఖానా ముందు నిలబడే టైముకి ఆ స్కూలు నించి కుర్రాళ్ళంతా వస్తూ వుంటారు. వాళ్ళు కార్ఖానా దగ్గర కొచ్చేసరికి ఆ కుర్రాడు కార్ఖానాలో ఇటూ అటూ తిరుగుతూ వుంటాడు. ఓ మోటారు సైకిలు మీద కూచుని దాన్ని స్పీడుగా నడుపుతున్నట్టు పోజు పెడతాడు. లేకపోతే కారు తలుపు తీసి స్టీరింగు ముందు కూచుని చక్రం ఇటూ అటూ తిప్పుతూ వుంటాడు. కాకపోతే ఓ స్క్రూడ్రైవరో పానాయో తీసుకుని ఏదో బిగిస్తున్నట్టు పోజు పెడతాడు.

**1895**, నవంబరు ఒకటవ తేదీన మాక్స్ మరియు స్కార్డనోవ్స్కి (*Skardanowski*) అనే ఇద్దరు జర్మన్ దేశస్థులు మొట్ట మొదటి సారిగా బెర్లిన్ పట్టణంలో వింటర్ గార్డెన్స్‌లో చలన చిత్రాన్ని ప్రదర్శించారు.

తరువాత **1896** జనవరి నుండి రోజువారిగా ఫిల్మ్ షోలు జార్జి మెలీస్ ఏర్పాటు చేశాడు మెలీస్ తన స్వంతంగా ఎన్నో ప్రసిద్ధమైన సినిమాలు నిర్మించాడు.

అలా పోజు పెట్టినప్పుడు ఆ కుర్రాడు నాకేసి తీవ్రంగా చూస్తున్నట్టు, నిర్లక్ష్యంగా నవ్వుతున్నట్టు అనిపిస్తూ వుంటుంది నాకు. ఎందుకో కొంచెం వెన్నులో జలదరింపు కూడా కలుగుతూ వుంటుంది.

ఆ స్కూలు కుర్రాళ్ళలో కొంతమంది ఆ కార్ఖానా దగ్గర ఆగి, ఆ కుర్రాడ్ని అందులో ఇళ్ళని చూస్తూ నిలబడతారు కొంత సేపు. ఎవరైనా కొంచెం సాహసించి లోపలికి రాబోతే ఆ కుర్రాడు వాళ్ళని గదమాయిస్తాడు. వాళ్ళు కొంచెం బెదిరి వెనక్కి జరిగితే ఆ కుర్రాడు నవ్వుతాడు. ఆ నవ్వు ఎంత బావుంటుందని! నల్లటి ముఖం మధ్య తెల్లగా మెరుస్తున్న పళ్ళు నిర్మలంగా వున్న కళ్ళు.

ఆ కుర్రాడు అలా నవ్వుతున్నప్పుడల్లా నా కేవిటో గుండెలో దేవినట్టుగా వుంటుంది. ఆ నవ్వు ఏమిటో నేను అందుకోలేని శిఖరంలా వుంటుంది. శిఖరం మీద సున్నితంగా బాలెన్సవుతున్న పెద్ద కొండ ముక్కలా వుంటుంది. అదెప్పుడైనా బాలెన్సు తప్పి నా మీద పడుతుందేమో అని అనిపించినప్పుడల్లా నా ఒంటిమీద వెంట్రుకలన్నీ నిటారుగా నిలబడతాయి.

గట్టిగా నవ్వకూడదంటాడు డాక్టరు నన్ను. నవ్వితే గుండెకి ప్రమాదంట. అంత నిర్మలంగా మా తాత నవ్వేవాడు. 'ఒరేయ్ నవ్వాలిరా. మనిషన్నాక గుండెలు నొప్పెట్టేట్టు రోజు కొక సారైనా నవ్వాలి. అలా నవ్వ గలిగేవాడే నిజంగా బతుకుతున్నట్టు!' అనేవాడు. ఆ కుర్రాడ్ని చూస్తుంటే మా తాతే గుర్తు కొస్తూంటాడు. మా తాతని చూసినప్పుడు కూడా నాకు అసూయగానే వుండేది.

ఆ నవ్వుని అక్కడే తుంచెయ్యడం మంచిదేమో అని కూడా అనిపిస్తూ వుంటుంది.

నేను నవ్వి బహుశా కొన్ని దశాబ్దాలైందనుకుంటాను. అయినా ఎలా నవ్వగలను. ఆ అవకాశాలు నా అంతట నేనే పాతి పెట్టేసుకున్నాను. ఎకౌంట్లు, బిల్లులు, క్రెడిట్ ఫైళ్ళు, డెబిట్ వోచర్లు ఇలా చాలా వాటిల్లో నన్ను కప్పెట్టేసుకున్నాను. వాటి బరువు తప్పించుకుని నవ్వడానికి ప్రయత్నిస్తే గుండె తట్టుకోలేకపోతోంది. డాక్టరు నవ్వద్దంటాడే కాని, ఆ గుండెలమీద బరువు దించేసుకోమనడు. అంటే ఎలా అయినా వాడు దించుకోమన్నా నేను దించుకోగలనా?

అలా కుర్రాళ్ళని గదమాయించి వాళ్ళని మళ్ళీ తనే పలకరిస్తాడు. వాళ్ళని ఏదో అడుగుతాడు. వాళ్ళు ఏదో చెప్తారు. నవ్వుతాడు ఓ కుర్రాడు పుస్తకం తీసి ఇస్తాడు. ఆ పుస్తకం ఇచ్చిన కుర్రాడ్ని మోటారు సైకిల్ని ముట్టుకోనిస్తాడు. తను ఓ మోటారు సైకిలు మీద ఓ కాలు ఫుట్ రెస్ట్‌మీద పెట్టి, మరో కాలు మడిచి సీటుమీద కూర్చుని ఆ పుస్తకం తిరగేస్తాడు. అలా ఓ రెండు నిమిషాలయ్యాక ఆ కుర్రాళ్ళు ఆ పుస్తకం తీసుకుని వెళ్ళిపోతారు. వెళ్ళిపోతూ అందరూ నవ్వుకుంటారు. వాళ్ళు వెళ్ళిపోయాక ఆ కుర్రాడిలో ఉన్నట్టుండి నవ్వుమాయమైపోతుంది. దిగాలుగా ఒక్కడూ సీటుమీద కూర్చుండిపోతాడు. కళ్ళు చెమర్చాయేమోనని అప్పుడప్పుడు నాకు అనుమానం వస్తూ వుంటుంది.

నాకేసి చూస్తున్నట్టే వుంటుంది, ఆ కుర్రాడి వాలకం. నేనూ, ఆ కుర్రాడూ రోడ్డుమీద తారసిల్లినప్పుడు ఆ కుర్రాడు నా కెప్పుడూ నమస్కారం పెట్టినట్టు గుర్తులేదు. ఆ కార్ఖానాలో వాళ్ళందరూ నాకు వంగి నమస్కరిస్తారు. ఆ కుర్రాడు నాకేసి తలకాయెత్తి చూస్తాడు. అదే చూపు. ఆ చూపు పడగవిప్పిన పాము చూసినట్టుంటుంది. నేను చూడకుండా తల తిప్పేసుకుంటాను.

మరి కొంత సేపటికి ఆ కార్ఖానాలోకి అసిస్టెంటు కుర్రాళ్ళొస్తారు. ఆ కుర్రాడు సీటు మీంచి గబుక్కున దిగుతాడు. అందులో ఓ అసిస్టెంటు కుర్రాడి నెత్తిమీద కొడతాడు. అందులో ఓ రోజు తప్పించుకుంటాడు, ఓ రోజు దెబ్బ తింటాడు. ఇంకొంత సేపటికి నా ఆఫీసు నిండుతుంది ఆ కార్ఖానా యజమాని కూడా వచ్చేస్తాడు. ఆ కుర్రాడు భయం భయంగా, నొక్కిపట్టిన స్ప్రింగులా తిరుగుతూ వుంటాడు. ఆ కుర్రాడికళ్ళు వదలబడ్డ తుపాకీగుళ్ళలా వుంటాయి.

ఆ కుర్రాడిలా తిరుగుతూ వుంటే, ఎందుకో బోనులో తిరుగుతున్న పెద్దపులి గుర్తుకొచ్చి నా ఎముకల్లో చలి బయల్దేరుతుంది.

వెంటనే తల తిప్పేసి నా ఆఫీసులో దాచేసుకుంటాను. అయినా నావీపు వెనకాల ఆ అడుగుల చప్పుడు దగ్గరవుతున్నట్టే వుంటుంది నా కెప్పుడూ. ✱

చలన చిత్రాలు ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా హాళ్ళులేనందున మ్యూజిక్ కై నిర్మించబడిన హాళ్ళలోనే ప్రదర్శించేవారు. యూరప్, అమెరికా దేశాలలోని మ్యూజిక్ హాల్ లన్నీ సినిమా హాలులుగా మారిపోయాయి.

మొదటి ప్రపంచయుద్ధం తర్వాత ముమ్మరంగా సినిమా హాల్స్ నిర్మాణం జరిగింది.